మందుపాతరను నిర్వీర్యం చేసిన జవాన్లు

మందుపాతర వెలికి తీస్తున్న జవాన్లు

నిర్జనిత ప్రదేశంలో మందుపాతర పేల్చిన జవాన్లు

కొత్తగూడెం క్రైం, జూన్ 15 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో భద్రతా దళాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను శనివారం గుర్తించిన బలగాలు వాటిని నిర్వీర్యం చేశాయి. వివరాల్లోకెళ్తే.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని నైమేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దడామాలి-కడేర్ మధ్య జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో సీఆర్‌పీఎఫ్ 231 బెటాలియన్, జంగ్లా-నైమేడ పోలీస్ బలగాలు బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నాయి. ఈక్రమంలో బీజాపూర్ బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్(బీడీఎస్), సీఆర్‌పీఎఫ్ 231 బెటాలియన్ బీడీఎస్ టీమ్ సంయుక్తంగా డీమైనింగ్ నిర్వహిస్తున్న క్రమంలో మూడు ప్రాంతాల్లో ఐఈడీని గుర్తించారు. మావోయిస్టులు స్ట్రీట్ సోలార్ ప్యానళ్లను కత్తిరించి అందులో ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్(ఐఈడీ) మందుపాతరను అమర్చినట్లు పోలీసులు తెలిపారు. నిర్మాణదశలో ఉన్న రోడ్డు మధ్యలో మావోయిస్టులు రెండుచోట్ల పైప్ బాంబులని, ఒకచోట కుకర్ బాంబ్‌ని అమర్చినట్లు పేర్కొన్నారు. ఈ మూడు ప్రదేశాల్లో మొత్తం 70 కిలోల ఐఈడీని వెలికితీసి, వాటిని నిర్జనిత ప్రదేశాల్లో నిర్వీర్యం చేసినట్లు వెల్లడించారు. ఈ మందుపాతరకి రెండుమీటర్ల దూరంలోనే స్విచ్ కమాండ్‌ని సైతం మావోయిస్టులు అమర్చినట్లు తెలిపారు.

ఎదురు కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు హతం

అందులో ముగ్గురు మహిళా మావోయిస్టులు

ఓ జవాన్ మృతి, మరో ఇద్దరికి గాయాలు

కొత్తగూడెం క్రైం, జూన్ 15 : మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులతోపాటు ఓ జవాన్ మృతిచెందాడు. మరో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా అబూజ్‌మడ్‌లో శనివారం చోటు చేసుకుంది. అబూజ్‌మడ్ పరిధిలోని కుతుల్, ఫర్సబేడా, కోడ్తమేట అంతర్గత అడవుల్లో ఈ నెల 12వ తేదీ నుంచి యాంటీ నక్సల్ ఆపరేషన్స్ జరుగుతున్నాయి. నారాయణ్‌పూర్, కొండగావ్, కాంకేర్, దంతేవాడ డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ 53వ బెటాలియన్, బీఎస్‌ఎఫ్ 135వ బెటాలియన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం పెద్ద సంఖ్యలో సాయుధులుగా ఉన్న మావోయిస్టులు తారసపడి జవాన్లపై మెరుపు వేగంతో కాల్పులు జరిపారు. దీంతో భద్రతా దళాలు తేరుకుని ఎదురు కాల్పులు ప్రారంభించాయి. ఇరువర్గాల మధ్య సుమారు రెండు గంటలపాటు కాల్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కాసేపటికి జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎదురు కాల్పుల్లో మృతి చెందిన 8 మంది మావోయిస్టుల్లో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. వారికి సంబంధించిన ఒక ఇన్‌సాస్ రైఫిల్, 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్‌తోపాటు ఇతర ఆయుధ వస్తు సామగ్రిని భారీ మొత్తంలో జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల కాల్పుల్లో ఒక ఎస్టీఎఫ్ జవాన్ మృతి చెందగా, మరో ఇద్దరు ఎస్టీఎఫ్ జవాన్లు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో మరికొందరు మావోయిస్టులకు బుల్లెట్ గాయాలయ్యాయని, వారిని తోటి మావోయిస్టులు తమతో తీసుకెళ్లారని, వారిలో మరికొందరు మృతి చెందే అవకాశం ఉందని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

ఆయిల్‌పాం బోర్డు ఏర్పాటు చేయండి

- నూనె పంటలకు ప్రోత్సాహం అందించని ప్రభుత్వాలు
- ప్రజల సమగ్రాభివృద్ధిని పట్టించుకోని ప్రధాని మోదీ
- రైతు సదస్సులో ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

ఆయిల్‌పాం చట్టంతో రూపొందించిన సమాచార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

అశ్వారావుపేట, జూన్ 15 : ఆయిల్‌పాం అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శరవేగంగా విస్తరిస్తున్న ఆయిల్‌పాం సాగుపై అవగాహన, రైతుల సంక్షేమం దృష్ట్యా బోర్డు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ భవనంలో శనివారం తెలంగాణ పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ దేశ సంపదకు మూలం రైతులు, కర్షకులేనని, ఫెడరేషన్ పేరుతో ఆయిల్‌ఫెడ్ సొమ్మును కొందరు దోచుకుంటున్నారని ఆరోపించారు. కేవలం వ్యవసాయం, అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రగతి ఫలాలను రైతులకు అందించడంలో విఫలమవుతున్నాయన్నారు. గత ఏడాది వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం రూ.730 కోట్లు కేటాయించి.. రూ.400 కోట్లు విడుదల చేసి.. రూ.300 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని ఉదహరించారు. భారతదేశం 1.30 కోట్ల టన్నుల పామాయిల్‌ను రూ.80 కోట్లు వెచ్చించి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, అయితే వంట నూనెలు పండించే అవకాశాలు ఉన్నా ఇక్కడి ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందించడం లేదన్నారు. నరేంద్ర మోదీ ఓట్లు, సీట్ల కోసం పడుతున్న శ్రమ.. ప్రజల సమగ్రాభివృద్ధి కోసం చేయడం లేదని ఎద్దేవా చేశారు. రైతులు ఆరుగాలం శ్రమించిన పండించిన పంటలకు గిట్టుబాటు ధర భరోసా కల్పించినప్పుడే ధైర్యంగా ఉంటారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతునేని సుదర్శన్‌రావు స్పష్టం చేశారు. పామాయిల్ టన్ను గెలల ధర కనీసం రూ.25 వేలు ఉండేలా కేంద్ర ప్రభుత్వం చట్టం తేవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. రైతు సంఘం పోరాటాల ఫలితంగానే దమ్మపేట మండలం అప్పారావుపేటలో రెండో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగిందని రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు గుర్తు చేశారు. రైతులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పేర్కొన్నారు. సదస్సుకు ముందు ఆయిల్‌పాం సాగు ప్రాముఖ్యత, రైతు సంఘం ఉద్దేశాలను ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు తుంబూరు మహేశ్వర్‌రెడ్డి వివరించారు. అనంతరం ఆయిల్‌పాం చట్టంతో రూపొందించిన సమాచారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. రైతు సంఘం రాష్ట్ర సదస్సు కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలమంచిలి వంశీకృష్ణ, అన్నవరం సత్యనారాయణ, ఆళ్ళ నాగేశ్వరరావు, భువనేశ్వర్‌రెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

పీవోకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం సభ్యులు

భద్రాచలం, జూన్ 15 : నానాటికీ అంతరించిపోతున్న ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని, ఇందుకోసం ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం వినూత్న ప్రయత్నంతో ముందుకు రావడం అభినందనీయమని భద్రాచలం ఐటీడీఏ పీడో ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కత్లే శ్రీధర్ బృందం పీవోను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బృంద సభ్యులతో పీవో మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆదివాసీ కళలపై ఆదివాసీలకు అవగాహన కల్పిస్తూ.. వారికి ఆదివాసీ నృత్యాలను నేర్పిస్తూ కళా నైపుణ్యాన్ని పెంచే విధంగా కృషి చేయడం మంచి పరిణామమన్నారు. దీనిపై డాక్యుమెంటరీ తీసి భావితరాలకు అందించేందుకు పూనుకోవడం అభినందనీయమని పీవో తెలిపారు. కార్యక్రమంలో గురుకుల ఆర్సీవో వెంకటేశ్వరరాజు, ఆదివాసీ కళా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సోయం విక్రమ్, ఐటీడీఏ మ్యూజియం ఇన్‌ఛార్జి వీరస్వామి, రేలా కళా బృంద నాయకురాలు సుధారాణి, కార్యదర్శి ఆనంద్, తిరుపతి, అభిరామ్ పాల్గొన్నారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

భద్రాచలం ఎంవీఐ కిషన్‌రావు

తనిఖీలు నిర్వహిస్తున్న ఎంవీఐ కిషన్‌రావు

బూర్గంపాడు, జూన్ 15 : ప్రైవేటు స్కూల్ బస్సుల నిర్వాహకులు, ప్రైవేటు వాహనాల యజమానులు, డ్రైవర్లు రవాణా శాఖ నిబంధనలు తప్పక పాటించాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) కిషన్‌రావు హెచ్చరించారు. మండలంలోని మోరంపల్లి బంజర ప్రధాన రహదారిపై క్షేత్రస్థాయిలో శనివారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని ఆపి వాటి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పత్రాలు సరిగా లేని వాహన యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహన యజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల తనిఖీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

కేటీపీఎస్ పదో యూనిట్‌లో ఓవరాల్ పనులు

250 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

కేటీపీఎస్ పదో యూనిట్

పాల్వంచ, జూన్ 15 : కేటీపీఎస్ ఐదో దశలోని పదో యూనిట్‌లో ఓవరాల్ పనులను శనివారం చేపట్టారు. ఓవరాల్ పనుల నిమిత్తం 250 మెగావాట్ల యూనిట్‌ను నిలిపివేసి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. 45రోజులపాటు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి ఓవరాల్ పనులు చేయనున్నారు. రూ.15 కోట్ల వ్యయంతో యూనిట్‌లోని ప్రధాన భాగాలన్నింటినీ విడదీసి పనులు మొత్తం పూర్తి చేయనున్నారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా విద్యుత్‌కు డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో టీఎస్‌జెన్కో సీఎండీ ఆదేశాల మేరకు ఓవరాల్ పనులు చేయనున్నారు. యూనిట్‌లోని ఎయిర్ హీటర్ పూర్తిగా జామ్‌కావడంతో పూర్తిగా తొలగించి కొత్తదాన్ని బిగించనున్నారు. బాయిలర్, జనరేటర్, టర్బైన్‌లోని అన్ని భాగాలను విడదీసి పాడైపోయిన పరికరాలన్నింటినీ తొలగించి కొత్త వాటిని వేసి యూనిట్‌ను సిద్ధం చేసేందుకు ఇప్పటికే ఇంజినీర్లంతా రంగంలోకి దిగారు. 45రోజులపాటు పనులు పూర్తిచేస్తే రెండేళ్ల పాటు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం ఉండదనే నిర్ణయానికి వచ్చిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై సీఈ ప్రభాకర్‌రావును సంప్రదించగా 45రోజులపాటు వార్షిక మరమ్మతులు జరగనున్నాయని సీఎండీ ఆదేశాల మేరకు పనులు జరుగనున్నాయన్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డులు

- ప్రలోభాలకు గురికావొద్దు..
- సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 15 : అనారోగ్య కారణాల వల్ల ఉద్యోగం చేయలేకపోతున్న కార్మికుల కోసం ప్రతి నెల నిర్వహించే మెడికల్ బోర్డును అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని సంస్థ సీఎండీ బలరాం శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న ప్రతి కార్మికుడిని తప్పనిసరిగా అన్‌ఫిట్ చేయడం జరుగుతుందని, ఈ విషయంలో ఇతరుల ప్రమేయం ఉండదని తెలిపారు. దళారులను నమ్మవద్దని సూచించారు. మాయ మాటలు చెప్పే వారి వివరాలను సింగరేణి విజిలెన్స్ అధికారి 9491144104 నంబర్‌కు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు.

వాణిజ్య

నెక్సాన్‌పై లక్ష రూపాయల ఆఫర్

ముంబై, జూన్ 15: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్‌కి చెందిన ఎస్‌యూవీ నెక్సాన్ మరో మైలురాయిని అధిగమించింది. దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చి ఏడేండ్లు పూర్తైన సందర్భంగా ఈ వాహనంపై ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. 2017 నుంచి 2024 వరకు ఏడేండ్లలో ఏడు లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించినట్లు కంపెనీ చీఫ్ కమర్షియల్ అధికారి వివేక్ శ్రీవాత్సవ తెలిపారు. డిజైనింగ్, భద్రత, కంఫర్ట్, సులభంగా డ్రైవింగ్ చేసే వీలుగా డిజైనింగ్ చేయడం వల్లనే ఈ మాడల్‌కు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

విజయవాడ-ముంబై ఎయిర్ ఇండియా ఫ్లైట్

మచిలీపట్నం, జూన్ 15: విజయవాడ నుంచి ముంబైకి డైరెక్ట్ విమాన సేవలు ప్రారంభించింది ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమాన సేవలు శనివారం ప్రారంభించారు. ముంబైలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయలుదేరనున్న ఏ-320 విమాన సర్వీసు విజయవాడకు సాయంత్రం 5.45కి చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో విజయవాడలో 7.10 గంటలకు బయలుదేరి ముంబైకి రాత్రి 9 గంటలకు చేరుకోనున్నది.

ఇంధనాలపై విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు

న్యూఢిల్లీ, జూన్ 15: ఇంధనాలపై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం మరోసారి తగ్గించింది. టన్ను క్రూడాయిల్‌పై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ని రూ.5,200 నుంచి రూ.3,250కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన రేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం ఈ విండ్‌ఫాల్ ట్యాక్స్‌ని జూలై 1, 2022న విధించిన విషయం తెలిసిందే.

ఎస్బీఐ వడ్డీరేట్ల పెంపు

నూఢిల్లీ, జూన్ 15: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో వాహన, గృహ రుణాలపై చెల్లింపులు మరింత భారంకానున్నాయి. శనివారం నుంచి అమలులోకి వచ్చిన ఈ రుణాల్లో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.65 శాతం నుంచి 8.75 శాతానికి సవరించింది. వాహన రుణాలు ఏడాది కాలపరిమితితో, వ్యక్తిగత రుణాలు రెండేండ్ల కాలపరిమితితో మంజూరు చేస్తున్నది బ్యాంక్. దీంతో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.10 శాతం నుంచి 8.95 శాతం మధ్యలో లభించనున్నాయి.

ఎఫ్‌డీలపై కూడా..

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును బ్యాంక్ సవరించింది. గతంలో రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును పెంచిన ఎస్బీఐ..తాజాగా రూ.3 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 75 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది. ఏడు రోజుల నుంచి 45 రోజుల లోపు డిపాజిట్లపై వడ్డీని 3.5 శాతం నుంచి 4 శాతానికి, 46 రోజుల నుంచి 179 రోజుల వడ్డీరేటు 5.5 శాతం నుంచి 6 శాతానికి, 180-210 రోజుల లోపు ఎఫ్‌డీలపై 6.75 శాతానికి, 211 రోజుల నుంచి ఏడాది లోపు ఎఫ్‌డీలపై వడ్డీని 6.5 శాతం నుంచి 7 శాతానికి సవరించింది. అలాగే ఏడాది నుంచి రెండేండ్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటును 6.8 శాతం నుంచి 7.3 శాతానికి, 2 ఏండ్ల నుంచి మూడేండ్ల లోపు కాలపరిమితి డిపాజిట్లపై వడ్డీని 7.5 శాతానికి పెంచింది. మూడేండ్ల నుంచి ఐదేండ్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 6.75 శాతం నుంచి 7.25 శాతానికి సవరించిన బ్యాంక్, ఐదేండ్ల నుంచి 10 ఏండ్లలోపు డిపాజిట్లపై వడ్డీరేటును 7.50 శాతానికి పెంచింది.

ఎంసీఎల్ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్

మరో ఐదు బ్యాంకులు కూడా..

ఎస్బీఐతోపాటు మరో ఐదు బ్యాంకులు ఎంసీఎల్ఆర్ రేట్లను సవరించాయి. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంక్, కెనరా, పీఎన్‌బీ, ఐడీబీఐ బ్యాంకులు ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్‌ని 5 బేసిస్ పాయింట్లు సవరించింది. దీంతో రుణాలపై వడ్డీ రేటు 9 శాతం నుంచి 9.35 శాతం మధ్యలోకి చేరాయి. అలాగే యెస్ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 9.25 శాతం నుంచి 10.60 శాతం మధ్యలో ఉండగా, కెనరా బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.15 శాతం నుంచి 9.30 శాతంలోకి, పీఎన్‌బీ రేటు కూడా 8.25 శాతం నుంచి 9.10 శాతం మధ్యలో వసూలు చేస్తున్నది. అలాగే ఐడీబీఐ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.35 శాతం నుంచి 10 శాతం లోపు నిర్ణయించింది.

బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తీరు..

- ఒక్కరోజు రుణాలపై ఎంసీఎల్ఆర్ 8 శాతం నుంచి 8.10 శాతానికి..
- నెల, మూడు నెలల కాలపరిమితి రుణాలపై వడ్డీరేటు 8.20 శాతం నుంచి 8.30 శాతానికి
- ఆరు నెలల కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.55 శాతానికి పెంచింది. అంతకుముందు ఇది 8.45 శాతానికి..
- ఏడాది రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.55 శాతం నుంచి 8.65 శాతానికి సవరించింది
- రెండేండ్ల కాలపరిమితి రుణాలపై రేటు 8.75 శాతం నుంచి 8.85 శాతానికి పెంచింది.
- మూడేండ్ల రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.85 శాతం నుంచి 8.95 శాతానికి సవరించింది.

బ్యాంక్ బేస్ రేటు

10.40 శాతంగా నిర్ణయించింది.

ఎంసీఎల్ఆర్ అంటే

మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్(ఎంసీఎల్ఆర్) కంటే తక్కువ వడ్డీరేటుకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులకు అవకాశం లేదు.

10 వేల మంది నియామకాలను వాయిదావేసిన కంపెనీలు

ఫ్రెషర్లకు ఐటీ సంస్థల దెబ్బ!

న్యూఢిల్లీ, జూన్ 15: దేశీయ ఐటీ సంస్థలు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ దేశాలపై ఆర్థిక మాంద్యం పిడుగుపడటంతో ఐటీ సంస్థలు నిర్వహణ ఖర్చులను తగ్గించుకోడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. ఇప్పటికే పలు ఉద్యోగులను తొలగించిన సంస్థలు..తాజాగా క్యాంపస్‌ల నుంచి రిక్రూట్ చేసుకున్న ఉద్యోగులకు నియామకాలను నిలిపివేశాయి. దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, జెన్సర్‌లు ఏకంగా 10 వేల మంది ఫ్రెషర్లకు మొండిచెయ్యి చూపించాయి సంస్థలు. ఆన్ బోర్డింగ్‌లోవున్న ఉద్యోగులకు నిరాశతప్పటం లేదని నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్(ఎన్ఐటీఈఎస్) విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశీయ టాప్ ఐటీ సంస్థల్లో ఉద్యోగం వచ్చిందని సంబరపడుతున్న ఫ్రెషర్ల ఆశలు గండికొడుతున్నాయని ఎన్ఐటీఈఎస్ ప్రెసిడెంట్ హర్ప్రీత్ సింగ్ సాలుజా తెలిపారు. ముఖ్యంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోలో ఉద్యోగుల సంఖ్య సంయుక్తంగా 64 వేల వరకు తగ్గాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 50 వేల మంది ఫ్రెచర్లను నియమించుకున్న ఇన్ఫోసిస్..ఈసారి 11,900 మందిని మాత్రమే రిక్రూట్ చేసుకున్నది. రెండేండ్ల క్రితం భారీ స్థాయిలో సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు ప్రకటించిన సంస్థలు ప్రస్తుతానికి వెనుకంజవేస్తున్నాయి. అంతర్జాతీయ క్లయింట్లు ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం కూడా రిక్రూట్‌మెంట్లకు బ్రేక్‌పడినట్లు అయింది. అంతర్జాతీయ ఆర్థిక రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈ సారి ఎంత మందిని ఫ్రెషర్లను తీసుకునేదానిపై ఇంకా స్పష్టత రాలేదని ఐటీ ప్రతినిధి ఒకరు చెప్పారు. 2022లో మొత్తం రిక్రూట్‌మెంట్లలో 3-5 శాతం వరకు ఫ్రెషర్లను నియమించుకున్న టాప్ ఐటీ సంస్థలు.. ఇప్పటి వరకు వారికి ఎలాంటి రోల్‌ను అప్పగించలేదని టీమ్‌లీజ్ వెల్లడించింది. ప్రాజెక్టులు తగ్గుముఖం పట్టడం, ఫ్రెషర్లలో ప్రతిభ లేకపోవడం కూడా ప్రధాన కారణాలని పేర్కొంది. టీసీఎస్‌లో 2021-22లో 59 శాతంగా ఉన్న యువ ఉద్యోగుల వాటా గత ఏడాది 50.3 శాతానికి తగ్గింది.

ధర రూ.1.09 లక్షలు

నెక్సస్ సరికొత్త ఈ-స్కూటర్

చెన్నై, జూన్ 15: దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఫ్యామిలీ ఎలక్ట్రిక్ స్కూటర్ యాంపిర్ నెక్సస్‌ను పరిచయం చేసింది గ్రేవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ. చెన్నై షోరూంలో ఈ స్కూటర్ ధర రూ.1,09,900. ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో కే విజయ కుమార్ మాట్లాడుతూ..30 శాతం అధిక బ్యాటరీ లైఫ్, మరింత పవర్‌పుల్‌తో తీర్చిదిద్దిన ఈ స్కూటర్ నాలుగు రంగుల్లో లభించనున్నదన్నారు. ప్రస్తుతానికి చెన్నైలో లభించనున్న ఈ స్కూటర్ దశలవారీగా దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పొదుపు ట్రెండ్ మారుతున్నది..

- చేతిలో డబ్బులు ఉంచుకునేందుకు ప్రజల ఆసక్తి
- మారుతున్న సేవింగ్స్ పద్ధతులపై హోం క్రెడిట్ అధ్యయనం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): నాభి నిండితే నవాబుకైన జవాబు చెప్పొచ్చు అనేది పాత సామెతగా మారింది. జేబు నిండుగా పైసలు ఉంటే నవాబులాగైనా బతకొచ్చనేది నేటి విధానంగా... పొదుపు విధానంలో మార్పు వస్తున్నది. ఇటీవల కాలంలో మెట్రో నగరాల్లో నివసించేవారు పొదుపు చేసే పద్ధతిని మార్చుకుంటున్నారు. తాజాగా హోం క్రెడిట్ సంస్థ చేసిన అధ్యయనంలో చేతిలో డబ్బులు ఉంచుకోవడమే అసలైన పొదుపుగా భావిస్తున్నట్లుగా తేలింది. గతంలో మాదిరిగా స్టాక్ మార్కెట్లు లేదా డిపాజిట్లు, ఇతర ఆర్థిక మార్గాల్లో పెట్టుబడి పెట్టిన వాళ్లే... ఇప్పుడు వాటన్నింటికంటే చేతిలో డబ్బులు ఉంచుకోవడమే సురక్షితమని అనుకుంటున్నట్లుగా తన నివేదికలో వెల్లడించింది. ఒకవైపు సైబర్ నేరాలు, మరోవైపు స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో పొదుపు విషయంలో జనాభిప్రాయం మారుతున్నదని అధ్యయనంలో తేలింది. సంపాదించిన పైసలు కళ్ల ముందర ఉండటమే మంచిదనే భావన ఎక్కువైపోయింది. ఆన్‌లైన్ మోసాలు, నష్టాల భయం కారణంగా డబ్బులను ఇతర మార్గాల్లో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేస్తున్నారు. పాత కాలంలో మాదిరిగా సంపాదించిన డబ్బులను ఇంట్లో నిల్వ చేసుకునే విధానం ఇటీవల కాలంలో భారీగా పెరిగిందనీ చెబుతున్నారు. దేశంలోని అన్ని మెట్రో నగరాలను ప్రామాణికంగా తీసుకుని చేసిన అధ్యయనం ద్వారా మెజార్టీ జనాలు క్యాష్ సేవింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా స్పష్టమైంది. చేతిలో డబ్బులు ఉంటేనే ఆర్థిక స్వతంత్రత, సాధికారికతగా భావిస్తున్నారు. ఈ తరహా ఆలోచన ధోరణి మహిళల్లో ఎక్కువగా ఉండేదని, కానీ మగవారు కూడా ఇదే తరహా పొదుపు మంచిదనే భావనతో ఉన్నారు.

దక్షిణాదిలోనూ ఎక్కువే..

దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో డబ్బులను పొదుపు చేస్తున్న వారిలోనే ఎక్కువగా దక్షిణాదికి చెందినవారని తెలిపింది. ఇందులో మహిళలు ముందు వరుసలో ఉండగా.... ఇటీవల కాలంలో 39 శాతం మంది పురుషులు కూడా క్యాష్ రూపంలోనే సేవింగ